

"రూపాయి లేదు తల్లీ. నీదే బోణీ... సిటికెలో మార్చుకొస్తాను." అని రిక్షా తాత సుధీర వైపు ఒక్క క్షణం చూసి. "రిక్షా ఇక్కడే పెట్టి వెడతాలే తల్లీ." అన్నాడు.

"ఫరవాలేదు తాతా! ఆ రూపాయి నువ్వుంచుకో" అన్నది సుధీర.

బస్సు స్టాండులో ఓ రిక్షావాడు ఎనిమిది ఆడిగితే, ఇంకొకడు ఆరు అడిగాడు, మరింకొకడు పది అడిగాడు. 'తను వెళ్ళాల్సింది అంత దూరమా?' అనుకుంటూ ఉండగా ఈ రిక్షావాడు నాలుగుఅడిగాడు. తీరా రిక్షా ఎక్కాక అరగంటపైనే పట్టింది. దారిలోనే అనుకుంది. మరొక రూపాయి ఇద్దామని.

రిక్షా తాత అల్పా సంతోషి. వాడి ముఖం సంతోషంతో చింకి చాటంత అయింది. మూగగా దీవించాడు. సూటుకేసు తీసుకుని ఒక్క క్షణం గేటు దగ్గర నిలబడింది.

అది దొరల కాలంలో ఎర్రరాయితో కట్టిన బంగళా. ఆవరణ చుట్టూరా సర్వే, టేకు చెట్లు సరిహద్దు గోడల్లా ఉన్నాయి. దూరం నుంచి బంగళా అస్పష్టంగా చెట్ల మధ్య ఎర్రటి ముద్దలా కనిపిస్తుంది. దొరల కాలంలో అది ఓ ఉన్నతాధికారి నివాసభవనం. ఇప్పుడు అది 'డిస్ట్రిక్ట్ అండ్ సెషన్సు' జడ్జీ గారి నివాస భవనం. ఇప్పుడు దాంట్లో ఉంటున్నది రాజశేఖరంగారు.

సుధీర గేటు తెరుచుకుని లోపలకు ప్రవేశించింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ బంగళా దగ్గరకు వచ్చింది. భవనానికి ఎదురుగా ఉన్న నీళ్ళ తొట్టిలో తామర, కలువతీగలు పువ్వులతో, మొగ్గలతో నిండుగా ఉన్నాయి. భవనానికి ఇరుపక్కలా రకరకాల పూలమొక్కలు, గులాబీ మొక్కలు పూలతో కలకలలాడుతున్నాయి, మల్లె పొదలు గుబాళిస్తున్నాయి.

ఇందుమతి - రాజశేఖరంగారి శ్రీమతి - పోర్టికోలోకి వచ్చింది. పాలు విరిగిపోయాయి. బంట్రోతు వీరభద్రానికి పాలు తెమ్మని చెప్పడానికి వచ్చింది. ఆవిడ దృష్టి అప్రయత్నంగా సుధీర మీద పడింది. తను వచ్చిన పని మరచిపోయి కొద్ది క్షణాలు నిలబడిపోయింది. సన్నని పొడవైన విగ్రహం-పిరుదుల వరకూ వత్తయిన తలకట్టు - చెంపకు చారెడేసి కళ్ళు - ఆ కళ్ళలో అమాయకత్వం - మృదువైన వాసిక - నుదుటిపై అల్లల్లాడే ముంగురులు - ఆ[illegible] అవయవాల్లో మినమినలాడే యౌవనమూ, అద్భుత సౌందర్యమూ పోతపోసినట్లు ఉన్నాయి.

"నమస్కారం" సుధీర చేతులు జోడించి నమస్కరించింది.

"ఎవరమ్మా నువ్వు?"

సుధీర వడివడిగా నడుస్తూ ఇందుమతి దగ్గరకు వచ్చి.

"నా పేరు సుధీర..." అంది.

'పేరుకు తగ్గ రూపం రూపానికి తగ్గ స్వరం' అనుకున్నది ఇందుమతి.

"ఏం కావాలమ్మా?"

"నేను జడ్జీగారితో మాట్లాడాలి. న్యాయం కోసం వచ్చాను."

ఇందుమతికి విషయం అర్థమైపోయింది. తన భర్త దగ్గరకు తమకు న్యాయం చెయ్యమంటూ జనం రావడం మామూలే. వాళ్ళ పట్ల తన భర్త ప్రవర్తన తెలియంది కాదు. జవాన్ల చేత తరిమిస్తారు. ఇప్పు డీ అమ్మాయి అదే పనిమీద వచ్చింది. ఈ అమ్మాయికీ అలాంటి సత్కారమే జరగబోతోంది. ఇంట్లో తన భర్త నోటంట కోర్టు విషయాలు రావు. అవి ఆయన గుండెలో నిక్షిప్తమైపోయి ఉంటాయి. ఆయన తీర్పు న్యాయానికి మిల్లీమీటర్లో వెయ్యోవంతు కూడా పక్కకుజరుగదంటారు. లాయర్ల వాదోపవాదాలు, సాక్ష్యాధారాలు నిశితంగా పరిశీలించందే తీర్పు చెప్పడమంటూ జరుగదు. మనసుకి ముద్దాయి 'నిర్దోషి' అని తోస్తే 'ప్రాసిక్యూషన్' కథనం ఎంత పకడ్బందీగా ఉన్నా బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద ముద్దాయిని విడుదల చేసిన సందర్భాలు కాకపోతే పేరుకి శిక్షవేసిన సందర్భాలు ఉన్నాయి. ముద్దాయి దోషిగా తోచినప్పుడు మాత్రం నిర్దాక్షిణ్యంగానే శిక్షలు పడతాయి. దోషి నిర్దోషిగా రుజువై శిక్ష తప్పించుకున్నా ఫరవాలేదు కాని, నిర్దోషి దోషిగా రుజువై అన్యాయంగా శిక్ష అనుభవించకూడదు.

ఇందుమతి సుధీర వైపు మరొకసారి చూసింది. ఆమెను జవాన్లు గెంటుతున్న దృశ్యం కళ్ళముందు కదలాడి మనసు చివుక్కుమంది. నెమ్మదిగా నచ్చజెప్పి పంపేయాలని నిశ్చయించుకుంది.

"చూడు సుధీరా! ఈ జడ్జీగారి విషయం నీకు తెలిసినట్లు లేదు... కోర్టు విషయాలు ఇంట్లో మాట్లాడరు. అవి మాట్లాడటానికి ఎవరైనా వస్తే ఆయనకు ఎంతో కోపం వస్తుంది. జవాన్ల చేత గెంటిస్తారు. నువ్వు చిన్నదానివి. నీకు అలాంటి పరిస్థితి ఎదురవుతుందంటే బాధగా ఉంది. నిన్ను చూస్తూంటే న్యాయం నీ వైపే ఉందనిపిస్తోంది. నీకు నే నిచ్చే సలహా ఎవరైనా మంచి లాయర్ని పెట్టుకో. తప్పకుండా గెలుస్తావు."

సుధీర మృదువుగా నవ్వింది.

"జడ్జీగారిని గురించి ఎంతో విన్నాను. వ్యక్తిగతంగా కూడా న్యాయానికి విలువ నిస్తారని విన్నాను."

"అది నిజమేననుకో. కేసు విషయాలు ఇంట్లో మాట్లాడరు. ఆయన ని న్నింకా చూడలేదు. చూసి ఉంటే నిన్ను ఈపాటికే జవాన్ల చేత గెంటించేవారు. అందుచేత తొందరగా..."

ఇందుమతి మాటలు పూర్తి చెయ్యకుండానే సుధీర అన్నది.

"కోర్టుకి చెవులుంటాయి కాని కళ్ళుండవు. అక్కడి న్యాయం సాక్ష్యాన్ని బట్టి, లాయర్ల చాకచక్యాన్ని బట్టి ఉంటుంది. నాక్కావలసింది ఆ న్యాయం కాదు. నాకు సాక్ష్యాలు లేవు. నాకు అన్యాయం జరుగబోతోంది. దాన్ని అరికట్టి జడ్జీగారు నాకు న్యాయాన్ని చేకూరుస్తారని చాలా దూరం నుంచి వచ్చేను."

ఇందుమతి సుధీర వైపు చూసింది. కట్టుకున్న చీర నలిగి ఉంది. జుత్తు చెదిరి ఉంది. సుధీర మాటలు నిజమేననిపించింది. అంతలోనే భర్తకు అన్నం వడ్డించి వచ్చిన విషయం గుర్తుకు వచ్చింది. లోపలకు వెళ్ళబోతూ

"సుధీరా హాల్లోకి వచ్చి కూర్చో. ఆయనతో మాట్లాడటానికి మాత్రం ప్రయత్నించకు. ఆయన కోర్టు హడావిడిలో ఉంటారు. ముందు నీ సమస్య నాకు చెప్పు. ఆ తరవాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" అంది. సుధీర హాల్లోకి వెళ్ళి కూర్చుంది. ఇందుమతి లోపలకు వెళ్ళింది. అప్పటికే రాజశేఖరంగారు భోజనం చేసి లేచారు. ఆయనకు ఇష్టమైనా కూరా, పచ్చడీ కంచంలో వేసినవి వేసినట్లుగా ఉన్నాయి. వడ్డించిన అన్నంలో మూడువంతులు అలాగే ఉంది. అసలు ఆయన భోజనం చేస్తూంటే తను పక్కన కూర్చుని కొసరి కొసరి వడ్డిస్తుంది. అలాంటిది ఇవాళ ఆ పిల్ల వచ్చి తనను నిలబెట్టేసింది. 'తను పక్కన కూర్చోలేదని ఆయనకు కోపం వచ్చిందేమో!' అనుకుంది. ఆయన గదిలోకి వెళ్ళింది. అప్పటికే ఆయన డ్రెస్సు వేసుకున్నారు.


"మీ రివాళ భోజనం సరిగ్గా చెయ్యలేదు. నా వంట బాగులేకనా? కాకపోతే నేను పక్కన లేనని కోపమా?"

"నీ వంట బాగులేక పోవడమా? అదేంకాదు. నీ మీద కోపమూ కాదు. ఏవిటో ఇవాళ నా మనసు బావుండలేదు."

రాజశేఖరంగారు నవ్వు తెచ్చిపెట్టుకుని అన్నారు.

"మనసెందుకు బావుండలేదూ?"

"ఇవాళ ఓ కేసు తీర్పు చెప్పాలి. ఓ తండ్రి కన్నకొడుకుని హత్య చేశాడు. ఆ విషయం తనే



ఒప్పుకున్నాడు. దాన్ని బలపరుస్తూ సాక్ష్యాలూ ఉన్నాయి."

"ఎంతదారుణం! కన్నకొడుకుని హత్య చేశాడా? అసలు వాడు తండ్రా? రాక్షసుడా? అలాంటి దుర్మార్గుడికి శిక్ష వెయ్యడానికి ఆలోచనెందుకు? మనను పాడు చేసుకోవడమెందుకు? అసలు న్యాయస్థానాలు ఉన్నదెందుకండీ, న్యాయాన్ని నిలపడానికే కదా?"

"నువ్వు చెప్పింది నిజమే ఇందూ. న్యాయస్థానాలు ఉన్నది న్యాయరక్షణ కోసమే. అతనికి నేనే కాదు. నా స్థానంలో ఎవరున్నా కఠినమైన శిక్ష వేస్తారు."

"ఉరివేశారా?"

"వెయ్యవలసిందే. కానీ నేను వెయ్యడం లేదు. ఆజన్మ కారాగారశిక్ష మాత్రమే వేస్తున్నాను."

ఇందుమతి మాట్లాడలేదు. రాజశేఖరంగారు ఆవిడ దగ్గరకు వచ్చి అతి మెల్లిగా అన్నారు:

"ఇందూ? నే నేం కోరుకుంటున్నానో తెలుసా? ఆ ధర్మారావు శిక్ష అమలు పరచేలోగా జైల్లోంచి తప్పించుకుని సుదూర ప్రాంతాలకు పారిపోయి ప్రశాంతంగా బ్రతకాలని."

ఇందుమతి తెల్లబోయింది.

రాజశేఖరంగారి మనోనేత్రంలో ధర్మారావు మెదిలాడు. అతని మాటలు- వేదనాభరితమైన మాటలు ఆయన చెవుల్లో ధ్వనించసాగాయి.

"కొందరి దృష్టిలో అందం ఓ వరం. నా దృష్టిలో మాత్రం అది శాపం. నా కొడుకు అందగాడు. నలకూబరుడు ఎలా ఉంటాడో, మన్మథుడు ఎలా ఉంటాడో నాకు తెలీదు. కాని ఒక్క సంగతి మాత్రం చెప్పగలను. వాడిలాంటి అందగాళ్ళు అరుదుగా ఉంటారు. ఆ అందం దేవుడిచ్చిన వరమని భ్రమపడ్డాను. అయితే ఆ అందమే నా పాలిటా, వాడి పాలిటా శాపమైంది. నా భార్యది అద్భుత సౌందర్యం. మేడిపండులాగే నా భార్యకి అందానికి తగ్గ గుణం లేదు. కొడుకును కన్న ఏడాదికి పొరుగువాడితో కులకడం మొదలుపెట్టి, వాడితో లేచిపోయింది. నేను దానికోసం ఏడవలేదు. జాలిపడ్డాను. దాంతో అనుభవం మొహం మొత్తేక ఏ వేశ్యా గృహానికో అమ్మేస్తాడేమోనని బాధపడ్డాను. దాని జీవితం కుక్కలు చింపిన విస్తరవుతుందని విచారించాను. నా భార్య ఎక్కడుందో ఎలా ఉందో ఇప్పటికీ నాకు తెలీదు.

నాకు మిగిలిందల్లా కొడుకు. వాడే నా సర్వస్వం. రూపానికి తగ్గట్లు వాడికి సుందరం అని పేరుపెట్టి, కంటికి రెప్పలా చూసుకుంటూ అతి గారాబంగా పెంచాను. రూపానికి తగ్గ తెలివితేటలున్నాయి. ప్రేమ - అనురాగం - దయ - జాలి వీటిలో వాడికి ఏ ఒక్కటైనా కాస్తంతయినా ఉంటే వాడి లా తయ్యారయేవాడు కాదేమో? వాడిలో ఉన్నది కామం. వాడి దృష్టిలో ఆడది మగవాడి కోరికలు తీర్చుకోడానికి దేవుడు సృష్టించిన బొమ్మ. నటన వాడికి వెన్నతో పెట్టిన విద్య. సినిమాల్లో చేరితే బాగా రాణించే వాడేమో? వాడి రూపాన్ని చూసి, వాడి మాయమాటలు విని అమ్మాయిలు వాడి ఆకర్షణలో పడేవారు. వాళ్ళతో వాడికి కావాల్సింది అనుభవం. అనుభవం మొహం మొత్తేక ఆమె ఎవరో, తనెవరో? మరో ఆడదాని వెంట పడేవాడు. వాడి చేతిలో మోసపోయిన వాళ్ళు చాలామందే ఉన్నారు.

మోసపోయాక సంఘం చూపులకు తట్టుకోలేక ఉరిపోసుకున్న వాళ్ళు ఉన్నారు. వాడు మితిమీరేడు. చీకటిపడ్డాక నిర్జన ప్రదేశంలో స్నేహితులతో కాపువేసి ఆ దారినపోతున్న అమ్మాయిల్ని బలవంతంగా లాక్కుపోయి బలాత్కరించిన సందర్భాలు అనేకం. పెళ్ళయిన ఆడదాని మీద కూడా వాడికి దయలేదు. ఏ సినిమాకో వెళ్ళివస్తున్న భార్యాభర్తల్ని అటకాయించడం, భర్తని స్పృహ తప్పేవరకూ కొట్టి, అతని భార్యని బలాత్కరించి దాహాన్ని తీర్చుకోవడం... పెళ్ళయిన ఆడది ఏం చేస్తుందో మీకు తెలియంది కాదు. ఏ మగాడూ తన భార్య శీలాన్ని కోల్పోవడం సహించడు. హీనంగా చూడడమే కాదు, తన్ని తగలేస్తాడు. జరిగిన దాన్లో ఆమె తప్పు ఎంతవరకు?' అని ఆలోచించడు. మొగుడు వదిలేశాక ఆత్మహత్య చేసుకున్న వాళ్ళు, పుట్టింటి గడపతొక్కలేక వేశ్యాగృహాలు చేరిన వాళ్ళు ఎందరో ఉన్నారు. వాడి చర్యల్ని గమనించి మందలించాను. వాడు నా చెయ్యి ఏనాడో దాటిపోయాడు.

నా ఒక్కగా నొక్క చెల్లెలు కూతురు చంద్రమ్మ. పెళ్ళయి భర్తతో చల్లగా కాపురం చేసుకుంటోంది. నా మీద అభిమానం కొద్దీ నన్ను చూడటానికి వచ్చింది. సుందరం అర్థరాత్రి వేళ తప్ప తాగి వచ్చాడు. వాడి కళ్ళలో చంద్రమ్మ పడింది. దాన్ని పాడు చెయ్యడానికి సిద్ధపడ్డాడు. నేను అడ్డువెళ్ళాను. నన్ను బలంగా ఓ తోపు తోశాడు. వాడి బలం ముందు నే నేపాటి? గోడ మీద పడ్డాను. తలకి గాయం తగిలి స్పృహ తప్పేను. స్పృహ వచ్చి చూసేసరికి చంద్రమ్మ శవం చూరుకు వేళ్ళాడుతోంది. వాడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. వాడు సంఘానికి చీడపురుగు. స్త్రీ పట్ల కీచకుడు. వాడి వల్ల సంఘం నిర్వీర్యమైపోతుంది. స్త్రీ నడివీథిలో తలెత్తుకు తిరగాలంటే వా డిలాంటివాళ్ళు ఉండకూడదు. ఈ సంఘం వాడినేమీ చెయ్యలేకపోయింది. మనసు రాయి చేసుకుని, వాడి తల నరికేశాను. హత్యచేశానని నా అంతట నేనే వెళ్ళి పోలీసులకు చెప్పాను. ఇప్పుడూ అదే చెబుతున్నాను. నేను నేరం చేశాను. హత్య చేశాను. నా కొడుకును నా చేతులతోనే చంపాను. నా దృష్టిలో వాడు ఎప్పుడైతే నీతి నియమాల్ని ఉల్లంఘించేడో అప్పుడే చచ్చిపోయాడు. ఇప్పుడు నిజంగా చచ్చిపోయాడు.

కొడుకును చంపినవాణ్ణి మీ రందరూ ఎలా చూస్తారో తెలుసు. నేను చేసిన దానికి విచారించడం లేదు. స్త్రీ జాతి శ్రేయస్సు కోరి చేశాను. మీరు ఎలాంటి శిక్ష వేస్తారోనన్న బెంగ నాకు లేదు. నా కెవరూ లేరు. అంతేకాదు నా నిష్క్రమణ సంఘానికి ఏ విధంగానూ లోటు కాదు. నాకు ఉరి శిక్షే వెయ్యండి. ఇక్కడ దొరకని శాంతి పై లోకాల్లో నైనా దొరుకుతుందని నా ఆశ. చివరగా ఓ మాట. నా కథంతా విన్నారు. న న్నొక ధర్మ సందేహం పట్టి పీడిస్తోంది. అది మీరు తీర్చగలరేమో ఆలోచించండి. నా కొడుకు అలా తయారవడానికి కారణం - నా పెంపకంలో లోపమా? ఆ తల్లికడుపున పుట్టడమా?"

రాజశేఖరంగారు కదిలారు. ఇందుమతి ఆయన కూడా నడిచింది. హాల్లో కూర్చున్న సుధీర ఆయన కళ్ళలో పడింది.

"ఎవరూ?" భార్యవైపు ప్రశ్నార్థకంగా చూశారు.

ఇందుమతి మాటలు తడుముకోలేదు. "మా సీతాపతి అన్నయ్య కూతురు" ఉంది.

రాజశేఖరంగారు "అసలు నీకు అన్నయ్యలే లేరుగా?" అనలేదు.

పరధ్యానంగా "ఓహో" అంటూ వెళ్ళి కారులో కూర్చున్నారు. కారు కదిలింది.

ఇందుమతి తేలిగ్గా నిట్టూర్చి లోపలకు వచ్చింది.


"సుధీరా...జడ్జీగారు సాయంత్రం వరకూ రారు. మీ చుట్టా లెవరైనా ఉంటే చూసిరా."

"నా చుట్టా లెవరూ ఈ ఊళ్ళో లేరు. మిమ్మల్నేమీ కోరను. సాయంత్రం వరకూ మీ ఇంట్లో ఉండనిస్తే చాలు. జడ్జీగారితో మాట్లాడి నా దారిన నేను వెళ్ళిపోతాను."

"దానికేం మహాభాగ్యం! ఈ ఇంట్లో సర్వసాధారణంగా అతిథిలేని రోజంటూ ఉండదు. ఇవాళ నువు మా అతిథివి. లోపలికి పద" అంటూ సుధీరను లోపలకు తీసుకువెళ్ళింది ఇందుమతి.

పిల్లల కోసం చేసిన దోసెలుంటే రెండు ప్లేట్లలో డైనింగు టేబిల్ మీద పెట్టి "ఎప్పుడనగా తిన్నావో - ముందు కాస్త ఫలహారం తిందువుగాని రా" అంది.

"బస్సు దారిలో చెడిపోయింది. పొద్దున్న



అయిదింటికి చేరాల్సిన బస్సు తొమ్మిదింటికి చేరింది'' అంటూ బెట్టు చెయ్యకుండా ఇందుమతి పక్కకు వచ్చి కూర్చుంది సుధీర.

"పిల్లలకి టిఫిన్ బాక్సుల్లో పెట్టడానికి ఏదో ఒక టిఫిన్ చెయ్యాలి. పొద్దున్న ఎనిమిదింటికి వేసినవి...ఎలా ఉన్నాయో.''

"చాలా బాగున్నాయి. తల్లి వంట రుచి అతి మధురమంటారు. మా అమ్మ ఎలా చేసేదో తెలీదు. మీలాగే చేసేదేమో?'' ఫలహారం తిన్నాక ఇందుమతి కాఫీ కలిపి ఇచ్చింది.

"స్నానానికి నీళ్ళు పెట్టిస్తాను. వేడినీళ్ళు చేస్తావా? చన్నీళ్ళు చేస్తావా?''

"వేణ్ణీళ్ళే చేస్తాను... నా పరిస్థితి...''

అప్రయత్నంగా ఇందుమతి దృష్టి ఆమె కడుపు మీద పడింది. ఆ వెంటనే ఆమె మెడ చూసింది. మెడలో మంగళసూత్రాలు లేవు.

ఇందుమతికి సుధీర కథ అర్థమైనట్లే అనిపించింది. ఎవడో ప్రేమించానంటూ నమ్మించి మోసగించి ఉంటాడు. అతగాడు ఆయనకి ఏ స్నేహితుడి కొడుకో అయి ఉంటాడు. ఆయన కలగజేసుకుని తనకు సహాయపడతారని వచ్చింది.

సుధీర స్నానం చేసి, జడ వేసుకుని నుదుట తిలకం దిద్దుకుంది. ఇందుమతి ఫోటో ఆల్బమ్ తెచ్చి పిల్లల ఫోటోలు చూపిస్తూ చెప్పసాగింది.

"అది మా పెద్దమ్మాయి హేమ. పెళ్ళికి ముందు తీసింది. దానికిప్పుడు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ పిడుగులనుకో. పెళ్ళయి నాలుగేళ్ళయినా, ఇద్దరు పిల్లల తల్లయినా, హేమ ఇప్పటికీ నా కూడా చంటిపిల్లలా తిరుగుతుంది. రాత్రి నా పక్కలోనే పడుకుంటుంది. జడ నేనే వెయ్యాలి. అన్నం నేనే కలిపి పెట్టాలి. అది నా దగ్గర నాలుగేళ్ళ పసిపిల్లలా అయిపోయితుందనుకో. ఇక దాని పిల్లలు పగలంతా వాళ్ళకి నేను కావాలి. చిరుతిళ్ళ కోసం పగలంతా 'అమ్మమ్మా' అంటూ నా వెనుకే ఉంటారు. ఇక రాత్రయితే తినేవి తినేసి తాతయ్యా' అంటూ ఆయన దగ్గర చేరతారు. ఆయన చెప్పేకథలు వినడానికి. రాత్రి నిద్ర ఆయన పక్కలోనే. పక్కపాడుచేస్తారు. అయినా ఆయన ఒక్క మాట అనరు. అదీ, పిల్లలూ వస్తే ఎంత సందడనుకున్నావ్! అది మా రెండో అమ్మాయి దివ్య... నాలుగైదేళ్ళ క్రితం తీసింది. అదిప్పుడు బక్కగా లేదు. కాస్త ఒళ్ళు చేసింది. అందరూ అది నాలా ఉంటుందంటారు.''

ఆ తరవాత కొంతసేపు తన దిన చర్య చెప్పింది. ఆ తరవాత లోకం పోకడ చెప్పింది.

'ఇప్పటికే ఆలస్యమైంది. భోజనాలు చేద్దాం పద'' అంటూ ఇందుమతి లేచింది.

"మీరు పెద్దవారు. మీ రలా కూర్చోండి.'' అంటూ ఇందుమతిని కూర్చోబెట్టి, సుధీర చకచకా కంచాలు పెట్టింది, మంచినీళ్ళు పెట్టింది. వంటకాలు తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టింది. ఆ తరవాత వడ్డన చేసింది. ఇందుమతి ప్రేక్షకురాలిలా చూస్తూ ఉండిపోయింది.

"ఇవాళ నువ్వు పక్కనుండబట్టి ఫలహారం తిన్నాను. లేకపోతే అసలు దాని మీద మనసుపోదు. ఒకోసారి అన్నం ఒక్కర్తినీ కూర్చుని తింటాను. ఎవరూ పక్కన లేకపోతే తినాలనిపించదు. ఏదో పేరుకు అయిందనిపిస్తాను. సాయంత్రం నేనూ, ఆయనా, గౌతమ్, దివ్య కలసి తింటాం. ఎన్నెన్ని కబుర్లో. పొద్దున్న ఆయన వెళ్ళిన క్షణం నుంచి ఎప్పుడు సాయంత్రమవుతుందా ఎప్పుడు ఆయనా, పిల్లలూ వస్తారా' అని ఎదురు చూడ్డంతోనే సరిపోతుంది. ఇవాళ నీ తోడు ఉంది...''

సుధీర నాజూగ్గా తినడం గమనించి, "ఈ కాలం పిల్లలే అంత. తిండి విషయంలో శ్రద్ధ ఉండదు. కాళ్ళునొప్పులు, చేతులు నొప్పులు అంటూ ఆపసోపాలు పడడం. మా హేమా, దివ్యా కూడా నీలాగే నాలుగు మెతుకులు కొరుకుతారు. ఆ అన్నం కాస్తా కలుపు'' అంటూ సుధీర చేత కొసరి కొసరి తినిపించింది.

ఇందుమతి ఆదరణకి సుధీర కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

"ఛ ఛ... ఏమిటది సుధీరా, ఆ కళ్ళలో నీళ్ళేమిటి?''

"మా అమ్మ నా నాలుగో ఏట పోయిందట. నాకు మా అమ్మ ఎలా ఉంటుందో తెలీదు. కనీసం ఓ ఫోటో అయినాలేదు. తల్లిప్రేమ ఎలా ఉంటుందో తెలీదు. మిమ్మల్ని చూస్తూంటే మా అమ్మ గుర్తుకు వస్తోంది.''

"అయ్యో నీకు తల్లి లేదా సుధీరా!'' ఇందుమతి నొచ్చుకుంది. భోజనాలయ్యాక ఇందుమతి వారిస్తున్నా వినక సుధీర కంచాలు తీసేసి ఎంగిళ్ళు ఎత్తి బల్ల తుడిచింది. వంటపాత్రలు ఎక్కడివక్కడ పెట్టింది.

"నువ్వు అతిథివి. అలాంటి పనులు చెయ్యకూడదు.''

సుధీర మృదువుగా నవ్వింది.

"నేను మీ కంటే చిన్నదాన్ని. చిన్నవాళ్ళు చెయ్యడం న్యాయం కద.''

"నువ్వెంతసేపూ న్యాయాన్ని గురించే మాట్లాడుతున్నావు. నీకు నేనేమీ కాకపోయినా, నువ్వు నాకెంతో సాయం చేస్తున్నావు. అదే మా దివ్య అయితేనా - ఇక్కడ పుల్ల అక్కడ పెట్టదు. పొద్దున్న పనిలో ఉండి పాలు కాచమన్నాను. గిన్నె సరిగా కడిగిందో లేదో మరి. రెండులీటర్ల పాలు విరిగిపోయాయి. నువ్వే చెప్పు సుధీరా. పెళ్ళయి అత్తా రింటికి వెళ్ళబోయే పిల్లకి వంటా వార్పూ రాకపోతే ఎలా చెప్పు. ఏదైనా పనిచెప్ప భయం - గారాలు పోతుంది. ఇక ఆయన దానికి వకాల్తా తీసుకుంటారు. 'పెళ్ళయ్యాక అదెలాగా చేసుకోవాలి. ఇప్పట్నుండే దానికి పని చెప్పకు అంటారు.''

"వంటావార్పూ బ్రహ్మవిద్య కాదు. దివ్య పెళ్ళయిన కొద్దిరోజుల్లోనే నేర్చుకుంటుంది లెండి.''

"దాన్ని చూడకుండానే నువ్వూ దానిపక్షానే మాట్లాడుతున్నావూ.''

సుధీర సమాధానం చెప్పలేదు.

ఇందుమతి సుధీరను మేడమీద పడగ్గదిలోకి తీసుకువెళ్ళి "నేను కాసేపు నడుం వాలుస్తాను. నువ్వూ పడుకో' అంది.

"మీరు పడుకోండి. నాకు పగలు పడుకునే అలవాటులేదు.''

ఇందుమతి పక్కమీద వాలి, "నీ సమస్య చెప్పు సుధీరా! నేను జడ్జీని కాను కాని జడ్జీగారి భార్యను కద. ఆయన సాంగత్యం వల్ల నీ సమస్యకి పరిష్కారం చెప్పగలనేమో?''

[ముగింపు వచ్చే సంచికలో]

## అమెరికా ఆవుల అదృష్టం

అమెరికాలోని ఆవులు కూడా అందరిలాగే ఆనందంగా విలాస జీవితం గడుపుతున్నాయంటే ఆశ్చర్యంగా ఉంటుంది కదూ! కానీ ఇది అక్షరాలా నిజం. మెంఫిస్ నగర సరిహద్దులో నివసించే బెర్నార్డ్ పార్సన్ అనే పెద్దమనిషి తన "డైరీ ఫాం"లోని ఆవులకు నలభైవేల డాలర్లు ఖర్చుపెట్టి చిన్న గది కట్టించాడు. డోర్ కర్టన్లు, ఏర్ కండిషన్లే కాకుండా, నేల మీద చక్కని కార్పెట్ కూడా పరిపించాడు. కంప్యూటర్ల లెక్క ప్రకారం మేత, స్టీరియో ఫోన్ల సంగీతం సరే సరి. ఈ ఆదరా బాదరా జీవితం కన్నా అమెరికాలో ఆవై పుట్టడం మేలు.

'భావ'రాజు

